కొత్త రేషన్ !

నూతన లబ్ధిదారులకు ఈనెల నుంచి సన్నబియ్యం

- నిరీక్షణకు తెరదించిన ప్రభుత్వం
- దరఖాస్తులపై కొనసాగుతున్న విచారణ
- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 5,29,698 కార్డుల్లో..
- 17,71,767 మంది సభ్యులు



సాక్షి,సిటీబ్యూరో: రేషన్ (ఆహారభద్రత) కార్డులు, వాటిలో కొత్తగా సభ్యుల పేర్ల చేర్పులు/ మార్పుల కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్న వారి నిరీక్షణకు ప్రభుత్వం తెరదించింది. నూతన లబ్ధిదారులకు ఈనెల (మే) నుంచి రేషన్‌బియ్యం పంపిణీ చేస్తోంది. మీ సేవ, ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి ప్రభుత్వం కొత్తరేషన్ కార్డులను కూడా మంజూరు చేసింది. సభ్యుల చేర్పుకోసం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు కూడా కార్డుల్లో నమోదవుతున్నాయి. ఇప్పటికే అధికశాతం పేర్లు రేషన్‌కార్డుల్లో చేర్పులు/ మార్పులు జరిగాయి. ఈనెల నుంచి వీళ్లందరికీ సన్నబియ్యం మంజూరు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి.

దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ..

మీ–సేవ, ప్రజాపాలన దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించి కొత్త కార్డుల మంజూరు చేయటంతో పాటు చేర్పులు/మార్పుల్లో నూతన లబ్ధిదారులను చేర్చాం. వారికి రేషన్ దుకాణాల్లో ఈ నెల(మే) నుంచి సన్నబియ్యం అందిస్తాం అర్హులు కొత్త కార్డుల కోసం, చేర్పుల కోసం దరఖాస్తు పెట్టుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణ నిరంతరంగా సాగుతోంది.

– శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్‌ఓ, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా

నిరీక్షణకు తెర..

కొత్త రేషన్ కార్డుల కోసం ఐదేళ్లుగా అర్హులైన నిరుపేద కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. రేషన్ కార్డుల్లో పేర్లు తొలగించుకుని నూతనంగా దరఖాస్తులు చేసుకున్న వారు కూడా చాలామంది ఉన్నారు. కొత్తకార్డులు మంజూరు లేక, సభ్యుల నమోదు కాక ప్రభుత్వ పథకాలు, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలకు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు ప్రభుత్వం కొత్త కార్డుల మంజూరుతో పాటు నూతన సభ్యులను చేర్చడంతో దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయోజనం ఇలా..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 818 కొత్తరేషన్ కార్డులు మంజూరయ్యాయి. అలాగే 33 వేలమంది ఉన్న రేషన్‌కార్డుల్లో సభ్యులుగా చేరారు. దీంతో నూతనంగా మొత్తం 17,71,767 సభ్యుల పేర్లు కొత్తగా రేషన్‌కార్డుల్లో నమోదయ్యాయి. ఈనెల నుంచే నూతన లబ్ధిదారులకు రేషన్‌బియ్యాన్ని అందించనున్నారు. వీరందరికీ ఈ నెలలో పంపిణీ చేసేందుకు జిల్లాకు 11 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మంజూరు చేశారు.

- ఆహార భద్రత కార్డులోని ప్రతీ సభ్యుడికి 6 కిలోలు.. అంత్యోదయ కార్డులోని వారికి 35 కిలోలు, అన్నపూర్ణ కార్డు కలిగిన వారికి 10 కిలోల చొప్పున సన్నబియ్యం అందించనున్నారు.

పెండింగ్‌లో 3 వేలు..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో రేషన్ (ఆహార భద్రత) కార్డుల్లో చేర్పులు/మార్పులకు సంబంధించి 38 వేల దరఖాస్తులు మీసేవ ద్వారా రాగా.. ఇప్పటి వరకు 33 వేల మందిని రేషన్‌కార్డుల్లో సభ్యులుగా పౌరసరఫరాల శాఖ చేర్చింది. ఇవి పోగా, మిగతా 3 వేల మ్యూటేషన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సంబంధిత అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

- కొత్త రేషన్‌కార్డుల కోసం మీ సేవతోపాటు ప్రజాపాలనలో పెట్టుకున్న దరఖాస్తులు కూడా వందల్లో పెండింగ్‌లో ఉండగా.. వాటిని రెవెన్యూ అధికారులు పరిశీలించడంతో పాటు విచారణ నిర్వహిస్తున్నట్లు సంబంధిత శాఖ వర్గాలు చెబుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే కొత్తగా మంజూరు చేసిన 818 రేషన్‌కార్డులను కలుపుకొని మొత్తంగా 5,29,698 రేషన్ (ఆహారభద్రతా) కార్డులు ఉన్నాయి.

మహనీయులను నిత్యం స్మరించుకోవాలి

అక్షర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విష్ణువర్ధన్‌రెడ్డి

ఘట్‌కేసర్: దేశంలో కుల, వర్ణ వ్యవస్థను అంబేడ్కర్ రూపుమాపాడని, 60 దేశాల రాజ్యాంగాలు చదివి భారత్‌కు రాజ్యాంగం అందించారని అక్షర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొక్క విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ లాంటి మహనీయుడిని నిత్యం స్మరించుకోవాలని, ఆయన రాసిన రాజ్యాంగం కారణంగానే ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తుందన్నారు. దాసు, బాల్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, రాందాసు, బాలయ్య, చంద్రమోహన్, ఆంజనేయులు, ఆనంద్, నిఖిల్, భరత్, అఖిల్, యాకేష్, లలిత్, నాగసాయి పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద విష్ణువర్ధన్‌రెడ్డి, అరుణ్‌కుమార్



సమ్మేళనంలో కీసర జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కీసర: కీసర జిల్లా పరిషత్ హైస్కూల్ 1990–1991 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సంబరంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి దశలో తాము పాఠశాలలో వ్యవహరించిన తీరు, ఉపాధ్యాయులు తీసుకున్న శ్రద్ధను నెమరేసుకుని, అప్పటి బాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పోచారం: ఏదులాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన 1999–2000 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అన్నోజిగూడలోని తులిప్స్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఉపాధ్యాయులు సంజీవయ్య, వెంకుల్, యాదయ్య, నాగమణి, కల్పన, హనుమాన్‌దాస్, శ్రీదేవి, వెంకటేష్, శ్రీనివాస్, ఇంద్ర, ముంజులావాణి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



వేదిక్ మ్యాథ్స్‌ను తెలుసుకుంటున్న గురుకుల కార్యదర్శి వర్షిని, పావనీజంగయ్య

వేసవి శిబిరం సందర్శన

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల లలిత కళల పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి వర్షిని సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలతో కూడిన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. విద్యార్థుల ప్రదర్శనను ఆమె ఆదివారం తిలకించి వారిని అభినందించారు. చదువుతో పాటు అదనపు నైపుణ్యం పెంపొందించుకోవడానికి వేసవి శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. గురుకుల విద్యాసంస్థల ఆర్థిక కార్యదర్శి కిరణ్మయి, సంయుక్త కార్యదర్శులు సంతోషి, గీత, సక్రునాయక్, శారద, రజని, భీమయ్య, నిర్మల, వింధ్యారాణి, ప్రిన్సిపాల్‌లు రాము, వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

బోడుప్పల్: నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్‌లో 11వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్త శ్రీవిద్యచక్రపాణిగౌడ్ సొంత నిధులతో హేమానగర్‌లో రూ 4.25 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, రూ .2.50లక్షలతో ఏర్పాటు చేసిన కాలనీ కమాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలికవసతులు కల్పించేందుకు ప్రజాప్రతినిధులు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. బోడుప్పల్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, నేతలు కొత్త రవిగౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, కాలనీవాసులు సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్ గుప్తా, గోపి, జమునారాణి, లావణ్య పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం



కీర్తన



పుష్ప

జవహర్‌నగర్: వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడలోని న్యూ భవానీనగర్‌లో గిరిశెట్టి రవీందర్, భార్య రజిత, పిల్లలతో కలిసి ఉంటున్నారు. కుమార్తె కీర్తన (15) బొమ్మలరామారంలోని కస్తూర్బా పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈనెల 3న కీర్తన గుర్తుతెలియని వ్యక్తికి ఫోన్‌చేసి ఫోన్ రికార్డు తొలగించి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

మరో ఘటనలో మహిళ

గబ్బిలాలపేటలో నివసించే దండు వేణుగోపాల్, భార్య పుష్ప (40) కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నారు. పుష్ప ఓ అపార్టుమెంట్‌లో పనిచేస్తుంది. ఈ నెల 3వ తేదీన పనికోసం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో చోట యువకుడు..



కార్తీక్

జవహర్‌నగర్ బజరంగ్ కాలనీలో నివసించే తాడిశెట్టి రంగారావు కుమారుడు కార్తీక్ (20), ఈనెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం తెలిసిన చోట వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పందెం కోళ్ల శిబిరంపై దాడులు..

– నిందితుల అరెస్ట్

మల్లాపూర్: నాచారం కౌండిన్యనగర్‌లో గుట్టుచప్పుడు కాకుండా పందెం కోళ్ల ఆడుతున్న శిబిరంపై మల్కాజ్‌గిరి ఎస్వోటీ, నాచారం పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం రాఘవేంద్రనగర్ సైదులు(30), మల్లాపూర్ సూర్యనగర్‌కు చెందిన లక్ష్మణ్(34), లాలాపేట్ హనుమాన్‌నగర్‌కు చెందిన నర్సింహ(55), వెస్ట్ మారేడుపల్లికి చెందిన బెల్సాజర్ హోరో(33), ఎల్బీనగర్ బ్యాంక్‌కాలనీకి చెందిన గుంజి కోటేశ్వర్‌రావు(28), చైతన్యపురికాలనీకి చెందిన బత్తుల ప్రసాద్(35)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 16 పందెం కోళ్లు, రూ.41 వేలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో నగరేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన

అల్వాల్: మురళీకృష్ణ కాలనీలోని సూర్య ఎన్‌క్లేవ్‌లో నూతనంగా నిర్మించిన వాసవీకన్యకాపరమేశ్వరి సమేత నగరేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమైంది. ఉదయం గణపతి పూజ, దేవత ఆహ్వానం, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశస్థాపన, చండీయాగం ప్రారంభించారు. ఈనెల 8 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు సిరిపురం ఆనంద్‌బాబు, నాగేశ్వర్‌రావు, శ్రీను, రాంబాబు, గంగాధర్, రమేష్, రమాదేవి, మాధవి, రాధిక, సరిత, శ్రీలత, నాగరాణి తదితరులున్నారు.



నేడు భోగారంలో రైతులకు అవగాహన

కీసర: నేడు భోగారం వార్డు కార్యాలయం వద్ద 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ఉంటుందని కీసర మండల వ్యవసాయాధికారి మాధవీలత తెలిపారు. సోమవారం ఉదయం నిర్వహించే ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, పంటల సంరక్షణ పద్ధతులు, మట్టినిల్వ, ఎరువుల వినియోగం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి రైతులందరూ హాజరుకావాలని, రైతుల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్య శిబిరంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, సిబ్బంది

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సనాతన ధర్మసేవా సమితి, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శోభారాణి ప్రారంభించగా.. వైద్యులు గ్రామస్తులు కంటిపరీక్షలు నిర్వహించారు. పలువురుకి కళ్లద్దాలు పంపిణీ చేశారు.

డాక్టరేట్ ప్రదానం



విష్ణువర్ధన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఇన్‌ఫ్రా గ్రూపు చైర్మన్ మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ బొక్కోని గూడకు చెందిన బొక్క విష్ణువర్ధన్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడు రాష్ట్రంలోని హుసురు పట్టణంలో జరిగిన ఏషియన్ ఇంటర్ నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ప్రభుత్వ ఉద్యోగం వదిలి, అక్షర ఫౌండేషన్ సంస్థను స్థాపించి ప్రజలకు అందించిన ఆర్థిక, సామాజిక, వైద్య సేవలు, నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణను ఇచ్చారు.

రాష్ట్ర కులగణన దేశానికే ఆదర్శం



ఘట్‌కేసర్: తెలంగాణలో కాంగ్రెస్ చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శమని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. ఆదివారం ఘట్‌కేసర్‌లో ఆమె మాట్లాడుతూ.. కులగణనతో రాష్ట్రంలో కులాల మధ్య ఉన్న అసమానతలు తొలగించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి ఆచరించి, దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. కులగణనపై కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఉప్పల్: గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లేఅవుట్‌లో 65 ఏళ్లున్న వృద్ధుడు మృతి చెంది ఉన్న విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలిపారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని విచారించగా.. మృతుడు బిక్షాటన చేసేవాడని నిర్ధారించారు. అనారోగ్యంతో మృతిచెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌కు డాక్టరేట్

ఉప్పల్: ఉప్పల్ మాజీ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లయన్ కృష్ణ ప్రసాద్‌కు మేర్ ల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రభుత్వరంగ సంస్థలోనే కాకుండా ఆయన పేదలకు చేసిన సేవలను గుర్తించి డాక్టరేట్‌తో సన్మానించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నిర్లక్ష్య డ్రైవింగ్.. వృద్ధురాలి మృతి

గౌతంనగర్: నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి వాణీనగర్‌లో నివసించే మంత నాగమణి (64) గృహిణి, ఈనెల 4న పాలప్యాకెట్ కోసం సమీపంలోని మారుతీనగర్ పాలబూత్‌కు నడుచుకుంటూ.. వస్తూ రోడ్డు దాటుతుండగా.. ఓ మినీవ్యాన్ (టీఎస్08యూజీ2123) అతివేగంగా వచ్చి నిర్లక్ష్యంగా నడిపి ఆమెను ఢీ కొట్టి పరారయ్యాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలై, ఎడమకాలు విరిగింది. సమాచారం అందుకున్న ఆమె కుమారుడు భరణికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు.

క్రమబద్ధీకరణ కలేనా!

- క్రమబద్ధీకరణకు నోచుకోని జవహర్‌నగర్ భూములు
- అప్పుడు జీవో 58,59 వర్తించలేదు, ప్రస్తుతం నో ఎల్‌ఆర్‌ఎస్
- రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతోనే క్రమబద్ధీకరణ
- ఆశగా ఎదురు చూస్తున్న జవహర్‌నగర్ వాసులు



జవహర్‌నగర్: ప్రభుత్వాలు మారినా పేద ప్రజల గూడుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావడంలేదు. ప్రత్యేక రాష్ట్రం వస్తే తమ బతుకులు మారతాయని ఆశగా ఎదురు చూసిన వారి కళ్లలో మాత్రం ఆనందం కనబడటం లేదు. ప్రభుత్వ భూముల్లో ఏళ్లుగా నివసిస్తున్న వారికి ప్రభుత్వం తీసుకున్న క్రమబద్ధీకరణ నిర్ణయం అందివచ్చిన అవకాశం.

- 30 ఏళ్లుగా కబ్జాలో ఉంటూ.. క్రమబద్ధీకరణ కోసం ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న జవహర్‌నగర్ ప్రాంత ప్రజలకు మాత్రం ఏదీ అక్కరకు రావడంలేదు. తాము ఉంటున్న ప్రాంతం ప్రభుత్వానిదో, మాజీ సైనికులదో తెలియక.. క్రమబద్ధీకరణపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.
- జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 30 వేలకు పైగా ఇళ్లు ఉండగా, మూడు లక్షల మంది నివాసం ఉంటున్నారు. దాదాపు వేయి ఎకరాల్లో ప్రజలు నివసిస్తుండగా.. గత ఐదేళ్ల క్రితం 334 ఎకరాలను మాత్రమే గ్రామకంఠంగా గుర్తించింది.
- తెలంగాణ ప్రభుత్వం 2015లో తీసుకొచ్చిన క్రమబద్ధీకరణ కోసం జవహర్‌నగర్ వాసులు దాదాపు రూ.7 కోట్లు కట్టినా ఇప్పటి వరకు క్రమబద్ధీకరించలేదు. తాజాగా ప్రభుత్వం మరోసారి ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకొచ్చింది.
- ప్రభుత్వం ఏ జీవోలను తీసుకొచ్చినా జవహర్‌నగర్ వాసులకు మాత్రం వర్తించడం లేదు. దీంతో ఆ ప్రాంత ప్రజల్లో ఆందోళనను పెంచుతోంది.

క్రమబద్ధీకరణకు ఎదురు చూపు..

ఖాళీ స్థలాల్లో చిన్న, చిన్న గుడిసెలు వేసుకుని కాలం వెళ్లదీస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న క్రమబద్ధీకరణ నిర్ణయం వారిలో ఆశలు రేకెత్తించింది. తమ బతుకులు మారుతాయని వారంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

- ప్రభుత్వ స్థలాల్లోని 125 గజాల్లోపు ఇళ్లు నిర్మించుకున్న పేదలకు పట్టాలిస్తుందనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఇక్కడి ప్రజలు స్వాగతిస్తుండగా.. మరోవైపు జవహర్‌నగర్‌లో ఉన్న భూములు మాజీ సైనికులవని, ప్రభుత్వానివి కావని కొంతమంది కోర్టును ఆశ్రయించారు. ఇటు ప్రభుత్వానికి అటు మాజీ సైనికులకు మధ్య కోర్టులో వాదోపవాదాలు నడుస్తున్నాయి. దీంతో గతంలో క్రమబద్ధీకరణ క్రమంలో కొంతమంది వద్ద (గ్రామకంఠం పరిధిలోని కొన్ని సర్వే నెంబర్లు) మాత్రమే క్రమబద్ధీకరణ దరఖాస్తులు స్వీకరించారు.

సుప్రీంకోర్టులో కేసు..

సుప్రీంకోర్టులో కేసు ఉన్న కారణంగా 30 వేలకు పైగా ఇళ్లకు దరఖాస్తులు తీసుకోలేదని అధికారులు చెబుతున్నారు. జవహర్‌నగర్ ప్రభుత్వ భూముల్లో నివాసం ఏర్పరచుకున్నవారు దాదాపు వేయి ఎకరాల్లోనే ఉంటారు. మిగతా భూములను మాజీ సైనికుల నుంచి కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి ప్లాట్లుగా విభజించి విక్రయించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఎల్‌ఆర్‌ఎస్ నిర్ణయంతో ఏం జరుగుతుందోనని ఇక్కడి వారు ఉత్కంఠంగా ఉన్నారు.

ఎన్‌వోసీల పేరుతో రిజిస్ట్రేషన్లు..

రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీలకు భిన్నంగా జవహర్‌నగర్ గ్రామ పంచాయతీ పరిపాలన జరిగింది. ఎన్‌ఓసీ ద్వారా ఖాళీ స్థలాలకు సైతం శామీర్‌పేట సబ్ రిజిస్ట్రార్ వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ ఇక్కడ వర్తిస్తుందా.. లేదా.. అనేది ప్రశ్నగానే మిగిలింది.

క్రమబద్ధీకరించే దిశగా ప్రభుత్వం..

ఎన్నో ఏళ్లుగా జవహర్‌నగర్‌లో నివాసాలు ఏర్పరచుకుని జీవిస్తున్న ప్రజల ఇళ్లను క్రమబద్ధీకరించడానికి తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. 2015లో క్రమబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం జవహర్‌నగర్‌లో దాదాపు రూ.7కోట్లు వసూలు చేసింది. ఇంకా ప్రభుత్వానికి రూ.50 కోట్ల వరకు రావాల్సి ఉంది. ప్రభుత్వం ప్రత్యేక జీవోతో అన్ని ఇళ్లను క్రమబద్ధీకరిస్తే రూ. 100 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.


ప్రత్యేక రాష్ట్రంలోనూ తప్పని కష్టాలు



ఏడు దశాబ్దాలైనా పేద ప్రజలు ఇంకా గూడు కోసం పోరాటం చేయాల్సి రావడం దురదృష్టకరం. పేదల ప్రభుత్వం అంటున్న నాయకులు జవహర్ నగర్‌ను పట్టించుకోవాలి. జీవో 58, 59ను జవహర్‌నగర్‌లో అమలు చేసి పేదల ఇళ్లను క్రమబద్ధీకరించాలి. జీవోను అమలు చేసే వరకు వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తాం.

– శ్రీనివాస్, సామాజిక కార్యకర్త

అప్పుచేసి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నాం



2015లో జీవో 59 ద్వారా ఇంటి స్థలాన్ని క్రమబద్ధీకరించేందుకు అవకాశం ఉందని అధికారులు ప్రకటించడంతో అప్పు చేసి రూ.1,50,000లు ప్రభుత్వానికి చెల్లించాం. ఆ తర్వాత గ్రామకంఠం ఏర్పడిందని, జీవో 59 వర్తించదని డబ్బులు తిరిగి చెల్లిస్తామన్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు.

– పోలయ్యగౌడ్, మాజీ సైనికుడు

పేదల ఇళ్లపై బుల్డోజరా .?



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదల ఇళ్లపైనే బుల్డోజర్ ప్రతాపం చూపుతున్నారు. కూలీ, నాలీ పనిచేసుకుని జీవిస్తున్న వారు పైసా,పైసా కూడబెట్టుకుని కట్టుకున్న రేకుల ఇళ్లను కూల్చడం ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం. ప్రభుత్వం చిత్తశుద్ధితో జవహర్‌నగర్‌లో నిర్మించిన ప్రతీ పేదవాడి ఇంటిని క్రమబద్ధీకరించి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలి

– ఈటల రాజేందర్, మల్కాజిగిరి ఎంపీ

బీఆర్‌ఎస్ హయాంలోనే జీవో 58,59 అమలు



బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే జీవో 58,59ను అమలు చేసి పేదల కళ్లలో ఆనందం చూశాం. అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో జవహర్‌నగర్ పేద ప్రజలకు అండగా ఉండి జీవో 58 పట్టాలను అందించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం జవహర్‌నగర్‌ను ప్రత్యేక జోన్‌గా తీసుకుని పేదలకు న్యాయం జరిగేలా చూడాలి.

– మల్లారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే

క్రమబద్ధీకరణ దిశగా అడుగులు



గత పదేళ్ల బీఆర్‌ఎస్ అనాలోచిత పాలనవల్లే ఈ దుస్థితి నెలకొంది. కాంగ్రెస్ పేదల ప్రభుత్వం. జవహర్‌నగర్‌లో నిరుపేదలు కట్టుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించేలా ప్రయత్నిస్తాం. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకంటే భిన్నంగా జవహర్‌నగర్ ఉంటుంది. సీఎంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు శాశ్వత పరిష్కారం లభించేలా చూస్తాం.

– తోటకూర వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్